క్లుప్తంగా

ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు


వీరాంజనేయ స్వామికి పూజలు నిర్వహిస్తున్న గాదె మధుసూదనరెడ్డి

ఇంకొల్లు(చినగంజాం): పావులూరు గ్రామంలో స్వయంభూగా వెలసిన పొలిమేర వీరాంజనేయ స్వామి వార్షిక తిరునాళ్ళ మహోత్సవంలో భాగంగా ఆదివారం పర్చూరు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ గాదె మధుసూదనరెడ్డి ప్రత్యే పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, తోమాలార్చన నిర్వహించారు. ఆయన వెంట పర్చూరు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు


సంతమాగులూరు(అద్దంకి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని కొమ్మాలపాడు వద్ద ఆదివారం జరిగింది. అందిన సమాచారం మేరకు బైక్‌పై వెళుతున్న వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో అతనికి తీవ్రగాయాలయ్యాయని.. క్షతగాత్రుడిని హైవే అంబులెన్స్‌లో నరసరావుపేట వైద్యశాలకు తరలించారు.

రాతి ముఖ మండప నిర్మాణానికి లక్ష విరాళం


రాతిముఖమండప నిర్మాణానికి విరాళం అందజేస్తున్న దాత

అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం రాతి ముఖమండప నిర్మాణానికి మండలంలోని బొమ్మనంపాడు గ్రామానికి చెందిన గోరంట్ల పద్మావతి శ్రీనివాస్ దంపతులు ఆదివారం రూ. 1,00,116 లను దేవస్థాన ఏసీ తిమ్మనాయుడుకు అందజేశారు. ఆయన దాతలను అభినందించారు.

బల్లికురవలో విద్యుత్ ప్రత్యేక లైన్


బల్లికురవలో ప్రత్యేక విద్యుత్ లైన్ పనులు

బల్లికురవ:

జీర్ణావస్థకు చేరిన విద్యుత్ పోల్స్ స్థానంలో కొత్తపోల్స్ ఏర్పాటుతో పాటు కిందకు జారిన విద్యుత్ లైన్‌లు సరిచేస్తూ బల్లికురవ సబ్‌స్టేషన్‌నుంచి ప్రత్యేక లైన్ పనులు చురుకుగా సాగుతున్నాయి. బల్లికురవ 33/11 కేవీ సబ్‌స్టేషన్ నుంచి చెన్నుపల్లి రోడ్ వరకు ఎత్తుగా ఉన్న స్తంభాలను ఏర్పాటు చేసి గృహాలకు వ్యవసాయానికి ప్రత్యేక లైన్‌వైర్లను ఏర్పాటు చేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. విద్యుత్ లైన్‌లకు మరమ్మతులతో పాటు ఈ ప్రత్యేక లైన్‌ల వల్ల లోవోల్టేజ్ సమస్యకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు.

అనుమానితులు కనిపిస్తే తెలియజేయండి


వాహనదారుల వద్ద లైసెన్సులు తనిఖీ చేస్తున్న ఎస్సై వెంకటేశ్వర్లు

వేటపాలెం:

సముద్రతీర గ్రామాల వద్ద తీరం వద్ద అనుమానితులు కనిపిస్తే వెంటనే పోలీస్‌లకు సమాచారం ఇవ్వాలని ఎస్సై ఐ. వెంకటేశ్వర్లు సూచించారు. వేటపాలెం నుంచి పొట్టి సుబ్బయ్యపాలెం, కఠారివారిపాలెం రోడ్డులో వై జక్షన్ వద్ద వాహనాలను ఆదివారం ఎస్సై తనిఖీలు నిర్వహించారు. సముద్ర తీర ప్రాంతాలకు వెళ్లే వాహనాలు, సముద్రతీరం నుంచి వచ్చే వాహచోదకుల వద్ద డ్రైవింగ్ లైసెన్సులు ఇతర సర్టిఫికెట్‌లను తనిఖీ చేశారు. ఎస్సై మాట్లాడుతూ ఎస్పీ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైల్వే స్టేషన్‌లు, బస్టాండ్ ప్రాంతాల్లో పోలీస్ పికెట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

బీమాతో ధీమా

- పీఎం సురక్ష.. పీఎం జీవన్ జ్యోతి యోజనతో ఉపయోగం
- ఉపాధి హామీ పథకం కూలీలకు భరోసా
- దరఖాస్తులు స్వీకరిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

నియోజకవర్గంలోని మొత్తం జాబ్‌కార్డులు **49100**

యాక్టివ్‌లో ఉన్న కార్డులు **38046**

వేతనదారుల సంఖ్య **49727**

యాక్టివ్‌లో ఉన్నవారి సంఖ్య **58336**

ప్రస్తుతం పనులకు హాజరవుతున్న వారి సంఖ్య **38552**


ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

అద్దంకి: ఎండనకా.. వాననకా కష్టించే జీవులకు ఏదైనా జరగరానిది జరిగితే.. వారి కుటుంబ సభ్యులు అనాథలుగా మారకతప్పదు. ఈ నేపథ్యంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ వేతనదారులకు కేంద్ర ప్రభుత్వం బీమా సౌకర్యాన్ని కల్పించింది. ప్రమాదాల్లో వేతనదారులు ప్రమాదవశాత్తు మరణించిన వైకల్యం కలిగిన వారికి బీమా రక్షణ కల్పించేందుకు ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి యోజన పథకాలను అమలు చేస్తోంది. అయితే ఈ పథకాలున్నట్లు చాలామంది వేతనదారులకు తెలియకపోవడంతో ఆయా కుటుంబాలు నష్టపోతున్నాయి. ఈ పథకాలతో జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి బీమా సదుపాయం కల్పించాలని పంచాయతీరాజ్ కమిషనర్లకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. వేతనదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించి వాటిని బ్యాంకుల్లో నమోదు చేయించే బాధ్యతను ఫీల్డ్ అసిస్టెంట్లకు మేట్లకు అధికారులు అప్పగించారు. వేతనదారులు దరఖాస్తు మీద సంతకం చేసి మేట్లకు అప్పగిస్తే మిగిలిన పనిని వారే చూసుకుంటారు. వేతనదారుల ఖాతా నుంచి ప్రీమియం మొత్తాన్ని బ్యాంకు ఖాతా నుంచి జమ చేసుకుంటారని అధికారులు చెబుతున్నారు. ఈ పథకాలకు అద్దంకి నియోజకవర్గంలోని వేతనదారులందరూ అర్హులే.

రెండు పథకాలు ద్వారా బీమా సదుపాయం

ఉపాధి వేతనందార్లకు కేంద్ర ప్రభుత్వం పీఎం సురక్ష పీఎం జీవనజ్యోతి యోజన పథకాలు ద్వారా బీమా సౌకర్యాన్ని కల్పిస్తోంది. పీఎం సురక్ష యోజన పథకం కింద 18 సంవత్సరాల వయసు నుంచి 70 సంవత్సరాల వయసులోపు వేతనదారులు ప్రతి సంవత్సరంలో 20 ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. ఈ పథకంలో నమోదైన వారు ప్రమాదవశాత్తు మరణించినా.. అంగవైకల్యం కలిగినా రెండు లక్షల పరిహారం అందుతుంది. పాక్షిక వైకల్యం సంభవిస్తే లక్ష రూపాయలు సహాయం అందుతుంది. పీఎం జీవన్ జ్యోతి యోజన పథకం కింద 18 సంవత్సరాల నుంచి 50 సంవత్సరాల వయసు లోపు ఉన్నవారు అర్హులు. ఈ పథకంలో నమోదైన వారు ఏడాదికి 436 రూపాయలు చెల్లించాల్సి ఉంటుంది. ఈ పథకంలో నమోదైన వారు సహజ మరణం పొందిన ప్రమాద మరణం పొందిన రెండు లక్షల రూపాయలు అందుతాయి. జాబ్ కార్డులో ఉన్న వేతనదారులంతా ఆయా పథకాల కింద ఫీల్డ్ అసిస్టెంట్లకు లేదా మేట్లకు ప్రీమియం చెల్లించి బీమా పథకాలకు అర్హులు కావాలని అధికారులు కోరుతున్నారు.

> **ప్రీమియం చెల్లించాలి**
> జాబు కార్డు ఉన్న వేతనదారులంతా ఫీల్డ్ అసిస్టెంట్లకు మేట్లకు ప్రీమియం చెల్లించి పీఎం జీవన్ జ్యోతి పీఎం సురక్ష యోజన పథకాల్లో నమోదు చేయించుకోవాలి. ఈ పథకాల కోసం ఎవరు నేరుగా నగదు చెల్లించాల్సిన అవసరం లేదు. దరఖాస్తు పై సంతకం చేసి మేట్లకు లేదా ఫీల్డ్ అసిస్టెంట్లకు ఇస్తే బ్యాంకు ఖాతా వారు ఆయా లబ్ధిదారుల ఖాతాలనుంచి జమ చేస్తారు.
> – ఏపీవో లక్ష్మీ గాయత్రి, కొరిశపాడు

ముమ్మరంగా వాహన తనిఖీలు


కారంచేడు కాలువ సెంటర్ వద్ద వాహన తనిఖీలు చేస్తున్న ఎస్ఐ వెంకట్రావు

కారంచేడు: భారత్–పాక్ యుద్ధంతో పాటు ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాలతో వాహన తనిఖీలను ముమ్మరంగా నిర్వహిస్తున్నామని ఎస్ఐ వి. వెంకట్రావు అన్నారు. ఆదివారం ఆయన మండల కేంద్రమైన కారంచేడు కాలువ సెంటర్, చినవంతెన సెంటర్, కల్యాణమండపం, పోలీస్ స్టేషన్ ప్రాంతాల్లో వాహనాలను నిసితంగా పరిశీలించారు. ఏ ఒక్క వాహనాన్ని వదలకుండా హైదరాబాద్, బెంగళూరు ప్రాంతాల నుంచే కాకుండా, విశాఖపట్నం, విజయవాడ, ఒంగోలు ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలను కూడా ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. కార్లు, ద్విచక్రవాహనాలు కూడా పోలీస్ సిబ్బంది తనిఖీలు చేశారు. కార్లలో ప్రయాణించే బ్యాగ్‌లను కూడా క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. అనుమానాస్పదంగా ఉంటే వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించి వివరాలు సేకరిస్తున్నారు. పోలీస్ సిబ్బంది ప్రతి వాహనం నంబర్లు కూడా నమోదు చేశారు.

గంగమ్మ తల్లికి ఆడపడుచుల పొంగళ్లు


కారంచేడులో ప్రత్యేక అలంకరణలో గంగమ్మతల్లి


గంగమ్మకు మొక్కులు చేసుకుంటున్న భక్తులు

కారంచేడు: గ్రామ దేవతగా విరాజిల్లుతున్న గంగమ్మతల్లికి గ్రామ ఆడపడుచులు పొంగళ్ళు నైవేద్యంగా సమర్పించారు. ఆదివారం వేకువజాము నుంచే ఆడపడుచులు పెద్ద ఎత్తున తలంటు స్నానాలు ఆచరించి ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి పొంగళ్ళు నైవేద్యంగా సమర్పించారు. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా విరాజిల్లుతున్న అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గత నెలలో అమ్మవారికి పెద్ద ఎత్తున తిరునాళ్ళు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఆలయం మూసివేశారు. తరువాత అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి అమ్మవారి ఆలయాన్ని భక్తులకు దర్శనానికి అందుబాటులో ఉంచారు. దీంతో అమ్మవారికి భక్తులు, గ్రామ ఆడపడుచులు పెద్ద ఎత్తున్న పొంగళ్ళు పైవేద్యంగా సమర్పించారు. ఆలయ అర్చకులు ఆవుల రాజేష్ భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు భక్తులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

14న నాగ ప్రతిష్ఠ మహోత్సవాలు


ముస్తాబైన బ్రహ్మంగారు, గోవిందమాంబ


ప్రతిష్ఠకు సిద్ధమైన నాగమయ్య


నాగమ్మ ప్రతిమ

బల్లికురవ: మండలంలోని కొణిదెన గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో బుధవారం ఉదయం నాగ ప్రతిష్ఠ, కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ వారు ఆదివారం తెలిపారు. ఆలయ అర్చకుడు అద్దంకి శ్రీనివాసాచారి, నాగబ్రహ్మాచారి బృందంచే మంగళవారం సాయంత్రం నాగమయ్య, నాగమ్మ అమ్మవార్ల విగ్రహాలను గ్రామోత్సవంతో ఆలయం వద్దకు చేర్చి పంచాధివాసాల్లో ఉంచనున్నట్లు చెప్పారు. బుధవారం ఉదయం ప్రతిష్ఠకు సంబంధించి గణపతి పూజ, పుణ్యాహవచనం, అఖండ దీపస్థాపన, దీక్షాబంధన, కలశస్థాపన ఉదయం 6.55 గంటలకు విగ్రహాల ప్రతిష్ఠ అనంతరం గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్ర స్వామి వారికి 25వ శాంతి కళ్యాణం, శిఖరానికి మహాకుంభాభిషేకం, అన్నసంతర్పణ చేపడుతున్నట్లు చెప్పారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నాగ ప్రతిష్ఠకు సంబంధించి ఇప్పటికే విగ్రహాలకు సిద్ధం చేశారు. ప్రతిష్ఠ కల్యాణోత్సవానికి సంబంధించి ఆలయాన్ని ముస్తాబుతో విద్యుత్ దీపాలతో ఆలంకరించి ఏర్పాట్లు చేపడుతున్నారు.

మాతృమూర్తి ప్రేమ అజరామరం


మాతృమూర్తి గొప్పతనాన్ని పిల్లలకు వివరిస్తున్న శ్రీరామచంద్రమూర్తి రెడ్డి

చినగంజాం: మాతృమూర్తి గొప్పతనాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని ప్రముఖసాహితీవేత్త కుక్కల శ్రీరామచంద్రమూర్తి రెడ్డి అన్నారు. మాతృ దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక శాఖ గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరంలో ఆయన మాతృమూర్తి గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. పుట్టిన ప్రతి బిడ్డకు మాతృమూర్తి మొదటి గురువు అని, మాతృభాషను నేర్పించేది కూడా అమ్మని.. ముందు తాను తన బిడ్డకు అన్ని విధాలుగా కాపాడుతూ మంచి ప్రయోజకుడుగా తీర్చిదిద్దుతుందన్నారు. మాతృ మూర్తి గౌరవించాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని తాను ప్రాణాలకు తెగించి బిడ్డకు జన్మనిస్తుందని అటువంటి అమ్మను బిడ్డలు ఏదిగిన తరువాత అపురూపంగా చూసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. అదే విధంగా మాతృభాషను కూడా మనం తప్పనిసరిగా గౌరవించి నేర్చుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. తెలుగు భాష ప్రాముఖ్యతను గురించి వివరించారు. గ్రంథపాలకుడు అళహరి మోహన లక్ష్మీ నరసింహాచార్యులు, రిసోర్స్ పర్సన్‌లు ఎస్. నరసింహారావు, వై. రామాంజనేయులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీ నరసింహ స్వామి కల్యాణోత్సవం


లక్ష్మీ నరసింహాస్వామి కల్యాణోత్సవం


దేవస్థానానికి వెండి దీపారాధన కుందులు అందజేస్తున్న దాత

అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శింగరకొండ క్షేత్రపాలకుడు కొండపై వేంచేసి ఉన్న లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో ఆదివారం స్వామి అమ్మ వార్ల కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వెండి దీపరాధన కుందులు బహూకరణ

శింగరకొండ పై వేంచేసి ఉన్న లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానానికి కడవకుదురు గ్రామానికి చెందిన సోమిశెట్టి వెంకటరావు రూ. 11 వేలు విలువ కలిగిన శంఖు, చక్ర నామాలతో కూడిన వెండి దీపారాధన కుందులను, దాత రాజ్యలక్ష్మీ, వంశీకృష్ణ జ్ఞాపకార్థం రూ. 15 వేలు విలువ కలిగిన కొబ్బరికాలు కొట్టే స్టాండ్‌ను దేవస్థాన ఈఓ యం. శ్రీనివాసరావుకు అందజేశారు.

ఉత్కంఠగా సాగుతున్న క్రికెట్ పోటీలు


ఉత్కంఠగా సాగుతున్న మ్యాచ్

ఇంకొల్లు (చినగంజాం): గాదె వీరారెడ్డి మెమోరియల్ రాష్ట్ర స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ సీజన్ 1 పోటీలు ఇంకొల్లు మండలం పావులూరు గ్రామంలో ఉత్సాహంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం రెండు మ్యాచ్‌లు నిర్వహించారు. మొదటి మ్యాచ్ బూదవాడ- అంబేడ్కర్ యూత్, జరుబుల వారిపాలెం అంబేడ్కర్ యూత్ జట్ల మధ్య మ్యాచ్ నిర్వహించారు. టాస్ గెలిచిన జరుబులవారిపాలెం టీం ఫీల్డింగ్ ఎంచుకున్నారు. మొదట బ్యాటింగ్ చేసిన బోదవాడ అంబేడ్కర్ యూత్ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 75 పరుగులు చేయగా తరువాత బ్యాటింగ్ చేసిన జరుబులవారిపాలెం టీం నిర్ణీత 10 ఓవర్లలో 7 వికెట్‌లు నష్టపోయి 67 పరుగులు మాత్రమే చేసింది. 8 పరుగులు తేడాతో బోదవాడ అంబేడ్కర్ జట్టు విజయం సాధించింది. రెండో మ్యాచ్‌లో పావులూరు సయ్యద్ ఫ్రెండ్స్ జట్టు మట్టిగుంట బీజేఆర్ యూత్ జట్టులు పోటీపడ్డాయి. మొదట టాస్ గెలిచిన మట్టిగుంట బీజేఆర్ జట్టు ఫీల్డింగ్ ఎంచుకున్నారు. పావులూరు సయ్యద్ ఫ్రెండ్స్ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 69 పరుగులు చేయగా మట్టిగుంట బీజేఆర్ యూత్ జట్టు 8 ఓవర్ల 3 బంతుల్లో 70 పరుగులు చేసి విజయం సాధించింది. మ్యాచ్‌లకు అంపైర్‌గా తెల్ల నరేష్, లెగ్ అంపైర్‌గా వల్లేరు అఖిల్ వ్యవహరించారు.

అలరించిన చిన్నారుల ఎగ్జిబిషన్



చీరాల రూరల్ : స్థానిక సెయింట్ మార్క్స్ సెంటినరీ లూథరన్ చర్చి ఆధ్వర్యంలో ఆదివారం సండేస్కూలు చిన్నారులకు వీబీఎస్ సండే నిర్వహించారు. చిన్నారులు వారం రోజులుగా సండేస్కూలులో టీచర్ల పర్యవేక్షణలో నేర్చుకున్న బైబిల్‌లోని అనేక అంశాలతో చర్చి ఆవరణలో ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఆనాటి కాలంలో ధరించిన వస్త్రాలు, కట్టడాల నమూనాలు ప్రదర్శించారు. దేవుని గీతాలను ఆలపించి నృత్యాలు ప్రదర్శించారు. దేశం కోసం చిన్నారులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముందుగా చర్చి పాస్టర్లు రెవరెండ్స్ పిల్లి దేవదాసు, పోకూరి నానిబాబు, గిఫ్టీలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి దేవుని వాక్యసందేశాలు అందించారు. చర్చి చైర్మన్ దేటా అశోక్‌కుమార్, పేర్లి ఆనంద్‌బాబు, బేతాళ సాల్మన్‌రాజు, పీసీసీ, ఎల్‌సీసీ, యూత్, స్త్రీల సమాజం పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నృసింహ స్వామి జయంతి


నృసింహ స్వామి

చినగంజాం: మండల కేంద్రమైన చినగంజాం భావన్నారాయణ స్వామి దేవాలయంలో నృసింహ స్వామి జయంతి ఉత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. జయంతిని పురస్కరించుకొని సుగంధ పరిమళ ద్రవ్యాలతో స్వామికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం రకరకాల పూలమాలలతో అలంకరించారు. ఈ సందర్భంగా ఇస్కాన్ మందిర ప్రతినిధి ఆంజనేయ ప్రభు హాజరై నృసింహ స్వామి విశిష్టత గురించి భక్తులకు తెలియజేశారు. భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు. భావన్నారాయణ స్వామి ఆలయ అర్చకులు ఏఎంఎల్ నరసింహాచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు వీవీ రామానుజం, శివ నారాయణ, గ్రామంలో భక్తులు పాల్గొన్నారు.

సైనికులకు సంఘీభావంగా సమైక్యతా ర్యాలీ


సమైక్యతా ర్యాలీ నిర్వహిస్తున్న వాకర్స్, రోటరీ క్లబ్ సభ్యులు

చీరాల రూరల్: భారత వీర జవాన్లకు సంఘీభావంగా ఎన్ఆర్అండ్‌పీఎం హైస్కూలు చీరాల వాకర్స్, రోటరీ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం సమైక్యతా ర్యాలీని ఘనంగా నిర్వహించారు. ముందుగా ర్యాలీ హైస్కూలు మైదానం నుంచి ప్రారంభించి మున్సిపల్ ఆఫీస్, బస్టాండ్ సెంటర్, గడియార స్తంభం సెంటర్, ముంతావారి సెంటర్ మీదుగా రోటరీ క్లబ్ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు జోహార్ వీర జవాన్ మురళీనాయక్, వందేమాతరం, భారత మాతాకీ జై, ఉగ్రవాదం నశించాలి, ఖబడ్దార్ పాకిస్థాన్, భారత్ ఐక్యత వర్ధిల్లాలంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. వాకర్స్ అధ్యక్షుడు పోలుదాసు రామాకృష్ణ, రోటరీ క్లబ్ అధ్యక్షుడు బాల వెంకటేశ్వరరావు మాట్లాడారు. కాశ్మీర్‌లో టూరిజం స్పాట్‌లో పాక్ ఉగ్రవాదులు కనికరం లేకుండా 20 మందికిపైగా మన భారతీయులను పొట్టనపెట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకు ప్రతీకారంగా మన ప్రభుత్వం పాకిస్థాన్ ఉగ్రవాద స్థావరాలపై దాడులు చేయడం మంచిపరిణామమన్నారు. అయితే పాకిస్థాన్ దొంగదెబ్బ కారణంగా మన జవాన్లు కొందరు మరణిస్తున్నారని అది బాధాకరమైన విషయమని పేర్కొన్నారు. కార్యక్రమానంతరం సభ్యులందరికీ అల్పాహారం ఏర్పాటు చేశారు. చారుగుళ్ల గురుప్రసాద్, నక్కల రమేష్‌బాబు, వలివేటి మురళీకృష్ణ, గ్రంధి నారాయణమూర్తి, డీవీ సురేష్, గుర్రం రాఘవ, బదరి, రమేష్, పూర్ణా, వాకింగ్, రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా మదర్స్ డే


తల్లులను సన్మానిస్తున్న రోటరీక్లబ్ సభ్యులు

అద్దంకి రూరల్: రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి స్థానిక ముస్లిం షాదీఖానాలో మదర్స్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 6 గురు తల్లులను రోటరీ పూర్వ అధ్యక్షుడు హాజీ సయ్యద్ మౌలాలి సౌజన్యంతో మాతృమూర్తులను సన్మానించారు. వారిని నూతన వస్త్రాలు, శాలువ, దుశ్శాలువాలతో సత్కరించారు. రోటరీ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, సెక్రటరీ చుండూరి మురళీ సుధాకరరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, ఏజీ మహమ్మద్ రఫీ, యు. దేవపాలన, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, జ్యోతి చంద్రమౌళి, అద్దంకి లెవీ ప్రసాద్, సంకాబాబు, అంజాద్‌బాషా, జాగర్లమూడి శివకుమారి, నర్రా శ్రీలక్ష్మీ, కొల్లా భువనేశ్వరీ, అలహరి హరి, ప్రసాద్, కోట అంజమ్మ పాల్గొన్నారు.

గ్రామ దేవతలకు పూజలు

బల్లికురవ: గ్రామాలు పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలని ఆదివారం మండలంలో వాడవాడలా గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలతో అలంకరణ చేపట్టారు. బల్లికురవ, కొత్తపాలెం, గుంటుపల్లి, వల్లాపల్లి, వైదన గ్రామాల్లో గ్రామ దేవతలైన పోలేరమ్మ, పోతురాజు, మహాలక్ష్మమ్మలకు ప్రత్యేక పూజలు చేపట్టారు. పొంగళ్లు తమ కుటుంబాలను కాపాడాలని ప్రార్థించారు.